# పరీక్ష

**సుబ్బారావు గుండె మరోసారి గుభేల్‌మంది.**

**ఆలోచనలు పరిపరివిధాలుగా పరుగులు తీస్తున్నాయి.**

**ఈసారి ఈయన ఏ కబురు చెప్తాడో అని బెంగతోనే హాస్పిటల్‌లోనికి ప్రవేశించాడు.**

* * *

ఆఫీసులో కూర్చుని పని చేస్తుండగా ఏదో అనీజీనెస్ ఫీల్ అయ్యాడు సుబ్బారావు. అయితే ముందు రోజే తన పెళ్ళిరోజు కావడంతో హోటల్ తిండి తినడం వల్ల గ్యాస్ట్రిక్ ట్రబులేమో అనుకున్నాడు. అంతకంతకు బాధ ఎక్కువవడంతో పక్కనే ఉన్న తన కొలీగ్ మూర్తికి ఈ విషయం చెప్పాడు సుబ్బారావు. మూర్తి గతంలో బి.యస్.సి. అయ్యాక కొన్నాళ్ళపాటు మెడికల్ రిప్రజెంటేటివ్‌గా పనిచేసి ఉండడంతో రోగాల గురించి కొంత తెలుసు. వెంటనే ఏవో నాలుగు పెద్ద జబ్బుల లిస్టు చెప్పేసరికి మరింత కంగారు పడిపోయాడు సుబ్బారావు. మూర్తి హడావుడి చేసి, ఆఫీసుకు శలవు చీటీ ఇప్పించి మరీ తెల్సిన ఆసుపత్రి వైపు ఆటోలో బయల్దేరారు స్నేహితులిద్దరూ. తీరా ఆసుపత్రికి చేరాక చాంతాండంత లైను. నెమ్మదిగా నెంబరు పెట్టి అక్కడే కుర్చీలో కూలబడ్డారిద్దరూ.

సుబ్బారావుకు కొంచెం కంగారెక్కువ. ఇప్పుడు మరింత బెంగ పట్టుకుంది. తనకేమయిందో తెలియదు-డాక్టరు ఏమంటాడో అని. అంతేకాదు 'బిల్లు' ఎంత వస్తుందో అని కూడా. కొంచెం సేపట్లో తన నెంబరు పిలిచారు. డాక్టరు చేంబరు లోనికి ఇద్దరూ అడుగుపెట్టారు. ఏముంది? షరా మామూలే. ఇసిజి, బ్లడ్ టెస్ట్, హెచ్ఐవి వగైరా..వగైరా..సుబ్బారావు జడుసుకున్నాడు ఈ టెస్టుల లిస్టు చూసి.

ఇదేంటి? తనింతవరకు తన భార్యను తప్ప మరే అమ్మాయి వైపు కన్నెత్తి కూడా చూడలేదు కనీసం రక్తదానమైనా స్వీకరించలేదు. అయినా నాకు ఎయిడ్స్ టెస్ట్ ఏమిటని మరింత దిగాలు పడిపోయాడు సదరు సుబ్బారావు.

"డాక్టరుగారూ! ఈ టెస్ట్‌లన్నీ అవసరమా?" అని భయం భయంగానే అడిగాడు సుబ్బారావు. వెనువెంటనే డాక్టరుగారి జవాబు "మీ ఇష్టం. మీ శరీరం..మీ ఆరోగ్యం".

సుబ్బారావు అవాక్కయిపోయాడు ఆ జవాబు విని.

అసలే మూర్తి జబ్బుల గురించి చిత్రీకరించిన వైనం.. ఆపై డాక్టరు సమాధానం...చేసేదేమీ లేక టెస్టుల కోసం లేబ్ వైపు బయల్దేరాడు. టెస్టులన్నీ అయ్యాయి. ఎందులోనూ ఏమీ లేదు... కానీ...

ఓ రిపోర్టు మాత్రం ఎటూ తేల్చక అటూ, ఇటూగా ఉంది. అంతే సుబ్బారావు హడలిపోయాడు. నీరసపడిపోయాడు. ఓరి దేవుడో..నాకేమిటీ విషమ పరీక్ష? ఇన్నాళ్ళూ నాకు తెలిసి ఎవరికీ ఏ అపకారం చేయలేదు-వీలైనంత వరకు భగవన్నామ సంకీర్తన చేయడం, లేదివారికి సాయం చేయడమే తప్ప.

ఈరోజు నాకేమిటీ పరిస్థితి? సుబ్బారావు ఆలోచనలు మందులకంటే ముందే గొంతు దిగుతున్నాయి. ఆ రిపోర్టులు చూసిన డాక్టరు మౌనంగా బోలెడన్ని మందులు రాసాడే తప్ప పెదవి విప్పలేదు.

సుబ్బారావు అంతరంగం కల్లోల కడలే అవుతోంది. డాక్టరు అన్నవాడు పేషంట్‌తో వాడి జబ్బేమిటి? ఎలా వుండాలో, మందులు ఎలా వాడాలో అని చెప్పాలి గాని అర్థంకాని భాషలో ప్రిస్క్రిప్షన్ రాసేస్తే సరా?

సుబ్బారావు బెంగకు అసలు కారణం మరొకటుంది. ఈమధ్యనే అన్ని లోన్లు పెట్టుకుని క్రొత్త ఇల్లు కట్టించుకుని గృహప్రవేశం చేసాడు. డబ్బులన్నీ ఖాళీ. ఈ మొత్తం హాస్పిటల్ ప్రహసనానికి ఎంత బిల్లు అవుతుందో అన్నది లోగుట్టు. అంతేకాదు. క్రొత్త ఇంట్లోకి వెళ్ళాక ఇలా అయింది కాబట్టి ఇంటివాస్తులో ఏదో లోపం అని అంటారేమో! ఏం మార్పులు చెయ్యాలో..లేక ఇల్లే ఖాళీ చెయ్యాలో..

ఎలాగైతేనేం మందులు కొనుక్కుని బయటపడ్డారు. ఆఖర్లో అవసరమయితే చిన్న 'ఆపరేషన్' అని ముక్తాయింపు ఇచ్చేడు డాక్టరు.

* * *

"సుబ్బారావూ..మనం సెకండ్ ఒపీనియన్ తీసుకుందాం" అన్నాడు మూర్తి రిపోర్టులన్నీ తిరగేస్తూ.

అంతే..సుబ్బారావు గుండె ఆగి మళ్ళీ కొట్టుకోవడం మొదలయింది. ఏదో చిన్న ఆశ...

తప్పుతుందా! మన శరీరం...మన ఆరోగ్యం..సరే అన్నాడు అయిష్టంగానే.

రెండో అభిప్రాయం. అదే సెకండ్ ఒపీనియన్... అంటూ మరో డాక్టరు దగ్గరకు వెళ్ళారు ఆ సాయంత్రం. అక్కడా షరా మామూలే. లైను...నెంబరు పాత చీటీలు చూపించి తన గోడు వెళ్ళబోసుకున్నాడు డాక్టరుతో. ఆయన మళ్ళీ అన్ని పరీక్షలు రాసి, మందులు వాడండి. అవసరమయితే చిన్న 'ఆపరేషన్'... ఆఖరి మాటలు సుబ్బారావు




చెవిలో పడలేదు. మళ్ళీ సందిగ్ధంలో పడ్డాడు సుబ్బారావు. హతవిధీ! ఏమిటీ గోరుచుట్టుపై రోకటిపోటు..అసలే ఇప్పుడిప్పుడే కోలుకుంటున్న తన ఆర్థిక స్థితి..దానికి తోడు ఇప్పుడు ఈ డాక్టరు కూడా ఆపరేషన్ అంటూనే మీ 'ఇష్టం' అంటున్నాడు. అంత డబ్బు ఇప్పటికిప్పుడు ఎక్కడనుండి తేను? ఎవర్నడగాలి అప్పు? అని లిస్టులు చూసుకున్నాడు సుబ్బారావు (అప్పు ఇచ్చేవాళ్ళ అడ్రసులు)

* * *

పాపం సుబ్బారావు తన మటుకు తాను మధనపడిపోతున్నాడు-ఎలా డబ్బు ఏర్పాటు చేయాలా అని.

కానీ తనకు అసలు విషయం తెలియదు.

ఇలా పేషంట్‌తోపాటు మరో అసిస్టెంటు వస్తాడు. వాడికిలాంటి 'రెండో' ఆలోచన వస్తుంది. ఇలాంటి వాళ్ళ దగ్గర ఎలాగైనా. ఎంతైనా 'సొమ్ము' చేసుకోవచ్చని రెండో డాక్టరే ఫోన్ చేసి మొదటి డాక్టరుని కనుక్కుని మరీ చెప్పాడు 'ఆపరేషన్-సెకండ్ ఒపీనియన్'.

**-ఎ.వి.రాధాకృష్ణమూర్తి (విశాఖపట్నం)**